



జిల్లా ప్లీనరీ సమావేశాల పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

4,5న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు

శింగనమలలో నిర్వహణ -జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ప్లీనరీ సమావేశాలు ఆగస్ట్ 4, 5వ తేదీల్లో శింగనమలలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా ఉపాధ్యక్షులు వైటిసి.రమేష్ తెలిపారు. సోమవారం గణేనాయక్ భవన్‌లో ప్లీనరీ సమావేశాల పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యా రంగంలో ఉన్న సమస్యలు పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటానికి శ్రీకారానికి ప్రణాళిక రూపొందించేందుకు ప్లీనరీ సమావేశాలు దోహదం చేస్తాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిరీర్యం చేసే కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత విద్యకు సంబంధించి ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రూ.6400 కోట్లు పెండింగ్ ఉన్నా వాటి గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నత విద్య అడ్మిషన్లు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం విచారకరం అన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు పోరాటాలకు ప్లీనరీ సమావేశాల్లో ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. విద్యార్థులు, మేధావులు పాల్గొని సమావేశాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ రజిత, జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి, జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రకాష్, భీమేష్, వెంకటేష్, శివ, వంశి, మెడికల్ కళాశాల గర్ల్స్ కన్వీనర్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.



అక్కడక్కడ వాన..!

◆ రెండు రోజులుగా తేలికపాటి వర్షం ◆ పూర్తి స్థాయి పదునయ్యేదెన్నడో .?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గడిచిన రెండు రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు అక్కడక్కడా పడుతున్నాయి. పడిన వర్షం కూడా ఎక్కడా పెద్ద స్థాయిలో లేదు. తేలికపాటి వర్షాలే పడుతున్నాయి. జూన్ మాసం ఆరంభమైనప్పటి నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. వాతావరణంలో నెలకొన్న మార్పుల నేపథ్యంలో రెండు రోజులుగా అక్కడక్కడా వర్షాలు పడుతున్నా పూర్తి స్థాయిలో పదునైంది లేదు.

రెండు రోజులుగా తేలికపాటి వర్షాలు

అనంతపురం జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. అంతటా తేలికపాటి వానలే పడ్డాయి. ఈనెల 19వ తేదీన అనంతపురం అర్బన్, విడపనకల్లు కుందుర్పి మండలాల్లో ఒక మోస్తరు వర్షపాతం నమోదయింది. అనంతపురం నగరంలో 22.8 మిల్లీమీటర్లు మాత్రమే వర్షం పడింది. నగరంలో కావడంతో ప్రధాన వీధులు జలమయం అయ్యాయి. విడపనకల్లులో 22.2 మిల్లీమీటర్లు పడింది. కుందుర్పి 19.6 మిల్లీమీటర్లు నమోదయింది. తక్కిన చోట్ల తేలికపాటి వర్షాలు పడినప్పటికీ 19 మండలాల్లో చినుకుజాడలేదు. 20వ తేదీ ఆదివారం యాడికి మండలంలో అత్యధికంగా 32.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. పెద్దపప్పూరు 21.2 మిల్లీమీటర్లు, గుంతకల్లు 17.2 మిల్లీమీటర్లు పడింది. ఆదివారం కూడా 18 మండలాల్లో చినుకుజాడ లేదు. రెండు రోజులుగా వర్షాలు పడుతున్నట్లు మేఘాలు కమ్ముకుని వస్తున్నా కేవలం ఐదు మండలాల్లోనే ఒక మోస్తరు వర్షపాతం పడింది. సోమవారం నాడు అక్కడక్కడ వర్షం పడింది. అత్యధిక మండలాల్లో వర్షం కోసం రైతులు ఇప్పటికీ ఆకాశం వైపు ఎదురు చూస్తూనే ఉన్నారు.

కొనసాగుతున్న వర్షాభావం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్ నుంచి ఇప్పటికీ వర్షాభావ పరిస్థితులే కొనసాగుతున్నాయి. 90.5 మిల్లీమీటర్లు అయితే పడిన వర్షం 59.1 మిల్లీమీటర్ల ఉంది. సత్యసాయి జిల్లాలోనూ ఇదే పరిస్థితులే కొనసాగుతున్నాయి. సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం 102.9 మిల్లీమీటర్లు అయితే పడిన వర్షం 43.1 మిల్లీమీటర్లు అనంతపురం జిల్లాలో 34.7 శాతం వర్షపాతం లోటు ఉండగా, సత్యసాయి జిల్లాలో 58.1 శాతం వర్షపాతం లోటు నెలకొంది. మండలాల వారీగా చూస్తే అనంతపురం జిల్లాలో 21 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

'అనంత'లో వర్షం

అనంతపురం నగరంలో సోమవారం రాత్రి ఒక మోస్తరు వర్షపాతం నమోదయింది. దీంతో నగరంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్ వంటి ప్రధాన కూడళ్లలో నీరు పెద్దఎత్తున ప్రవహించింది. దీంతో కొంతసేపు రాకపోకలకు ఇబ్బందులు నెలకొన్నాయి.

ప్రజానేత విఎస్.అచ్యుతానందన్

ఆయన మృతి ప్రజా ఉద్యమానికి తీరనిలోటు - సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిస్కారం కోసం నిరంతరం పరితపించిన వ్యక్తి విఎస్.అచ్యుతానందన్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప తెలియజేశారు. కమ్యూనిస్ట్ ఉద్యమ ప్రముఖ నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్.అచ్యుతానందన్ మతికి సిపిఎం అనంతపురం జిల్లా కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప సోమవారం ప్రకటన విడదల చేశారు. సిపిఎంతో ఎనిమిదన్నర దశాబ్దాల అనుబంధం కలిగిన వ్యక్తి విఎస్.అచ్యుతానందన్ అన్నారు. కఠినమైన జీవనశైలి, సామాజిక న్యాయం పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి అన్నారు. కేరళ రాష్ట్రంలో విఎస్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. ఆయన మతి పార్టీ, కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీరని లోటన్నారు. కార్మిక, కమ్యూనిస్ట్ నేతగా ప్రజ సమస్యలపై నిరంతరం తన గళం విన్పించారన్నారు. కేరళ అసెంబ్లీకి ఏడు పర్యాయాలు ఎన్నికయ్యారన్నారు. రెండు పర్యాయాలు ప్రతిపక్ష నేతగా, 2006-2011 మధ్య కేరళ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన పదవీకాలంలో కార్మికుల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టారని తెలియజేశారు. ఆయన ప్రజా జీవితం, పోరాటం ఎప్పటికీ స్ఫూర్తిదాయం అని కొనియాడారు.

జగన్‌కు జైలు తప్పదు

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణంలో వైసిపి అధినేత జగన్‌కు త్వరలో జైలుకు వెళ్లక తప్పదని విప్ కాలవ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని 22వ ఎన్నికల వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఎంపి మిథున్‌రెడ్డి కేంద్రంగా జరిగిన మద్యం కుంభకోణంలో అసలు సూత్రధారులు, పాత్రధారులు, భాగస్వాములు ఎవరూ చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. మద్యం డిస్టిలరీల నుంచి అక్రమంగా రూ.వేలకోట్లు వసూలు చేసిన అంతిమ లబ్ధిదారు తాడేపల్లి ప్యాలెస్ యజమానేనని ప్రత్యేక దర్యాప్తు బృందం ఆధారాలతో రుజువు చేయబోతోందన్నారు. జగన్మోహన్‌రెడ్డితో పాటు ఎవరైతే ఉన్నారో వాళ్లందరూ జైలు ఊచలు లెక్కించక తప్పదన్నారు. ఇకపోతే చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ద్వారా పిల్లల చదువులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా లబ్ధిదారుల కుటుంబాలకు సాయం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, వార్డు ఇన్‌ఛార్జి ఆనంద్, హనుమంతు, సీనా, సుమలత, మల్లి, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

అర్జీలకు తక్షణ పరిష్కారం

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలపై తక్షణం స్పందించి పరిష్కారం చూపాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మాలోలతో పాటు జిల్లా అధికారులతో కలిసి 612 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా శాఖల జిల్లా అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం తీసుకునే చర్యల్లో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. మండల స్థాయిలో కూడా పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి దరఖాస్తుదారునికి నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలకు సంబంధించిన ఫిర్యాదులపై దష్టిని సారించి సత్వరమే వాటి పరిష్కారానికి కషి చేయాలని తెలిపారు. మండల స్థాయిలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, రెవెన్యూ సేవలు, రీ సర్వే పనులను ఆయా గ్రామాల్లో వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. పి- 4 మార్గదర్శకుల పెండింగ్ పనులను పూర్తిస్థాయిలో నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఈఓ శివ శంకర్, సిపిఓ అశోక్ కుమార్, డిపిఓ నాగరాజు నాయుడుతో పాటు జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'దుర్గం' కౌన్సిల్‌పై హైడ్రామా..!

◆ ఏడు నెలలుగా జరగని కౌన్సిల్ సమావేశం
◆ ఛైర్మన్ ఆచూకీ చూపాలని పోలీసులకు కౌన్సిలర్ల ఫిర్యాదు
◆ నోటీసులిచ్చినా ఛైర్మన్ సహకరించలేదు : కమిషనర్
◆ నా మాటకు విలువ ఇవ్వలేదు : ఛైర్మన్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం మున్సిపల్ కౌన్సిల్ నిర్వహణ విషయంలో హైడ్రామా జరిగింది. ఏడు నెలలుగా కౌన్సిల్ సమావేశం నిర్వహణలో చోటు చేసుకుంటున్న పరిణామాలతో హైడ్రామా తెరలేపినట్లైంది. టీడీపీ, బీజేపీ సభ్యులతో పాటు వైసీపీ నుంచి ఇటీవల టీడీపీలో చేరిన కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు సోమవారం మున్సిపల్ కౌన్సిల్‌లో జరుగుతున్న సంఘటనలపై హైడ్రామా చేశారు. మున్సిపల్ ఛైర్మన్ రాజ్‌కుమార్ ఆచూకీ కనిపెట్టాలని పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కౌన్సిల్ సమావేశం అనంతరం కౌన్సిలర్లతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షులు సర్మస్‌వలీ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ వైపీ.రమేష్, ఇతర టీడీపీ నాయకులు ఛైర్మన్ ఛాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. కళ్యాణదుర్గంలో వైసీపీ సమన్వయకర్త రంగయ్య, మున్సిపల్ ఛైర్మన్ రాజ్‌కుమార్‌లు అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ ఆరోపించారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు చేస్తున్న అభివృద్ధి పనులతో ప్రజల్లో ఆదరణ వస్తుందని ఓర్వలేక కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడం లేదన్నారు.



ఛైర్మన్ ఆచూకీ కనుగొనాలని టౌన్ సిఐ యువరాజ్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

ఛైర్మన్ ఆచూకీ తెలపాలంటూ పోలీసులకు ఫిర్యాదు

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషిచేయాల్సిన ఛైర్మన్ రాజ్‌కుమార్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించేందుకు సహకరించకుండా కనిపించకూండా పోయాడని, ఆయన ఆచూకీ కనిపెట్టాలని పట్టణ సిఐ యువరాజ్‌కు ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్లు అనసూయమ్మ, మహాలక్ష్మి, రాజేశ్వరి, అనిత, రాధారాణి, వెంకటేశులతో పాటు 11 మంది కౌన్సిలర్లు ఫిర్యాదు ఇచ్చారు. ఆయనఉన కౌన్సిల్ సమావేశానికి తీసుకురావాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నోటీసులిచ్చినా తీసుకోలేదు : కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్

2024 నవంబర్ లేదా డిసెంబర్‌లో కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని స్వయాన నోటీసులు పంపినా ఛైర్మెన్ రాజ్‌కుమార్ తీసుకోలేదు. రెండు సార్లు రిజిస్టర్ పోస్టులో నోటీసులు పంపినా ఆయన నుంచి స్పందన లేదు. పట్టాణాభివృద్ధిపై ప్రతి మూడు నెలలకు ఒకసారి మున్సిపల్ సమాశాలు జరపాల్సి ఉంది. సోషల్ మీడియాలో ఛైర్మన్ ప్రచారం చేస్తున్న వాటిలో వాస్తవం లేదు.

నా మాటకు విలువ లేదు : ఛైర్మన్ రాజ్‌కుమార్

కౌన్సిల్ సమావేశాల నిర్వహణపై కమిషనర్‌తో పలుమార్లు చర్చించినా ఆయన పెడచెవిన పెట్టారు. సెక్షన్ క్లర్క్‌తో అజెండాల విషయమై చర్చించి కమిషనర్‌తో సంతకాలు చేయించమని చెప్పినా జరగలేదు. ఒకసారి కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని కోరితే ఎమ్మెల్యే అందుబాటులో లేనప్పుడు సమావేశం జరపలేమని చెప్పారు. తన మాటకు విలువ లేకుండా చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదు.

రాయదుర్గంలో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

రాకపోకలకు అంతరాయం-ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలోని బళ్లారి రోడ్డుపైనే వాహనాలు, బస్సులను నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. బళ్లారి నుండి వచ్చే బస్సులను రోడ్డుపైనే నిలుపుతుండటంతో ప్రయాణికులు దిగడం.. వారికి కోసం ఆటోలను బస్సు చుట్టూ ఏర్పాటు చేస్తుండటంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అసలే ఇరుకుగా ఉన్న రోడ్డుపై ఆటోలో నిలిపి ఉంచడం, బళ్లారి వైపు నుంచి వచ్చే బస్సులు ఆపడంతో ట్రాఫిక్ నిత్యకృత్యం అవుతోందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల ప్రకటన బోర్డులు, హోర్డింగులు, రాజకీయ పార్టీలు, ఇతర వాణిజ్య ప్రకటనల ఫ్లెక్సీ బోర్డులు రోడ్డుపైన ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. బళ్లారి బస్ స్టాప్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వెంటనే బళ్లారి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అంతవరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫ్లెక్సీలు, దుకాణాల హోర్డింగులు, ఇతర ఆక్రమణలను తొలగించాలని, ట్రాఫిక్ రద్దీ నివారణకు బస్సులను రోడ్డుపైన కాక రాణి సత్రం బస్టాండులో నిలిపేలా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు



సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం రాయదుర్గంలో భిక్షాటన చేసి నిరసన తెలుపుతున్న కార్మికులు

19 ద్విచక్ర వాహనాలు, ఆటో స్వాధీనం

ముగ్గురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

19 ద్విచక్ర వాహనాలతోపాటు ఓ లగేజీ ఆటోను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వి.శ్రీనివాస రావు తెలిపారు. సోమవారం నగరంలోని పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన బైనేని యతేంద్ర, బోగిశెట్టి యోగేశ్వర్, అనంతపురం గంగానగర్‌కు చెందిన సి.యశ్వంత్ కుమార్ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో మైనర్లు ఉండగా జువైనల్ కోర్టు ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. నిందితు నుంచి 2 టౌన్, 4 టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 19మోటార్ సైకిళ్లతోపాటు, లగేజీ ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.19 లక్షల ఉంటుందన్నారు. కేసులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో 2వ టౌన్ ఇన్స్‌పెక్టర్ శ్రీకాంత్, ఎస్ఐ సి.రుషేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఈత పోటీల్లో జిల్లాకు పతకాల పంట

5 స్వర్ణం, 2 రజతం మూడు కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఈనెల 19, 20వతేదీల్లో విశాఖపట్నంలో జరిగిన సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన ఈత క్రీడాకారులు 5 స్వర్ణం, 3 రజతం, 2 కాంస్య పతకాలను సాధించి రాష్ట్రంలో 7వ స్థానంలో జిల్లాను నిలిపారు. ఈ పోటీల్లో గ్రూప్ 1 క్రీడాకారుడు ఎస్.కార్తికేయ 5 స్వర్ణ పతకాలను సాధించి సత్తా చాటాడు. అలాగే పి.అకుల్ సాయి రెండు కాంస్య పతకాలు, ఎంఎస్ఎస్ జస్విన్‌నాయుడు మూడు రజత పతకాలను సాధించారు. పతకాలను సాధించిన క్రీడాకారులను జిల్లా ఈత సంఘం అధ్యక్షులు కామని రవిశేఖర్‌రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

విఎల్‌టి పన్ను విధించటానికి 11 ఏళ్లా..?

కమిషనర్‌ను ప్రశ్నించిన జెసి.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంత ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఖాళీ స్థలానికి విఎల్‌టి(వేకెంట్ ల్యాండ్ సైట్) పన్ను విధించాలని దరఖాస్తు చేసి 11 సంవత్సరాలు కావస్తునాన ఇప్పటికీ దానిని ఎందుకు అమలు చేయడం లేదని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి అనంత కమిషనర్ బాలస్వామిని ప్రశ్నించారు. సోమవారం జెసి ఈ విషయంపై కమిషనర్‌కు కలిసి మాట్లాడారు. దరఖాస్తు చేసి ఇన్నేళ్లవుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేషన్‌లో చిన్న పని జరగాలన్నా అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు ముట్టజెప్పితే గాని పనులు చేయరని నగర ప్రజల నుంచి విమర్శలు ఉన్నాయన్నారు. విఎల్‌టి టాక్స్ విధిస్తే మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం లభిస్తుందన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు.

అధికారుల తర్జనభర్జన

విఎల్‌టి టాక్స్ విధించాల్సిన స్థలం అనధికార అవుట్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. దీని వల్లే కార్పొరేషన్ అధికారులు గడిచిన 11 సంవత్సరాలుగా సదరు స్థలానికి వీఎల్టి వేయలేదు. ఒత్తిళ్లకు జడిసి టాక్స్ విధిస్తే స్థలాన్ని క్రమబద్ధీకరించినట్లు అవుతుందని అధికారులు భావించి ఈ విషయాన్ని గడిచిన 11 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉంచినట్లు సమాచారం. జెసి.ప్రభాకర్ రెడ్డి సదరు స్థలం విషయమై ప్రశ్నించడంతో అధికారులు డైలమాలో పడ్డారు. ఈ సమస్యను ఏమి చేయాలా అంటూ తలలు పట్టుకుంటున్నారు. కమిషనర్ అధికారులను వెంటబెట్టుకుని సంబంధిత స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లారు.

స్వీడన్ బ్లేకింగ్ వర్సిటీ పరిధిలో 16 మందికి అడ్మిషన్లు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం, బ్లెకింగ్ వర్శిటి (స్వీడన్) సంయుక్తంగా కలిసి ఇంటి గ్రేటేడ్ కోర్సులను అమలు చేస్తున్న కోర్సులకు సోమవారం 16 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్లు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు తెలిపారు. ఈమేరకు అడ్మిషన్ల పత్రాలను రిజస్ట్రార్ ఎస్.కృష్ణయ్యతో కలిసి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్, ఆలూమిని పి.సుజాత, అడ్మిషన్ డైరెక్టర్ ఎ.సురేష్‌బాబు, స్వీడన్ యూనివర్సిటీ అధికారులు వేల్పుల గురుదత్త, ఫణిశేఖర్, సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె

భీష్మించిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు - 'అనంత', రాయదుర్గంలో భిక్షాటన



తాడిపత్రిలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

తమ సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె విరమించేది లేదని సిఐటియు, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం నాయకులు హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 9వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా నగరంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 9 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. జీవో 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, చనిపోయిన వారి కుటుంబాల్లో వారి బిడ్డలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ వయో పరిమితి 62ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీం, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కుటుంబాల్లో ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు వెంకటనారాయణ, ఉపాధ్యక్షులు ఆర్‌వి నాయుడు, ఇంజినీరింగ్ సెక్షన్ నాయకులు మల్లికార్జున, రాయుడు, ఓబుళపతి, మురళి, పోతలయ్య, లక్ష్మి, పారిశుధ్య నాయకులు తిరుమలేశు, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, ఎర్రిస్వామి, ఆదినారాయణ, నాగేంద్ర, కమల్‌కుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : హక్కుల సాధన కోసం కార్మికులు సమ్మె చేయడం అనివార్యమైందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా తాడిపత్రిలో చేపట్టిన నిరసన సోమవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, రిటైర్‌మెంట్ సమయంలో రూ.75వేలు, దహనం సంస్కారాలకు రూ.20వేలు ఇవ్వాలని, వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, చనిపోయిన కార్మికుల కుటుంబానికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహారెడ్డి, రామాంజనేయులు, ఉమాగౌడ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జుబేర్, శ్రీరాములు, బాబు, బాషా, ప్రసాద్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు కమ్మగిరి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

రాయదుర్గం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం రాయదుర్గంలో కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచుతూ జారీ చేసిన 124 జిఓ కార్మికులను సంతృప్తి పర్చేదిగా లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, పాలకమండలి సభ్యులు మద్దతు తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో వార్డు సభ్యులు గోవిందరాజులు, లావణ్య, శారద, సంజీవప్ప, కోఆప్షన్ సభ్యులు నజీర్, వైసిపి రైతు విభాగ కార్యదర్శి పొరాళుశివ, పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ శివప్ప, శ్రీరామ్‌రెడ్డి, నిజాం, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించేంత వరకూ సమ్మె విరమించేది లేదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.నరసయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం సిఐటియు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరవధిక దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఆప్కాస్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు జిఓ 36 ప్రకారం 21వేల నుంచి రూ.24,500 వేతనం చెల్లించాలన్నారు. పదవీ విరమణ చేసిన కార్మికులకు ఆరు నెలలలోపు వారికి రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు జగదీష్, నాయకులు ఏసు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 9వ రోజుకు చేరుకుంది. కార్మికుల సమ్మెకు అంతర్జాతీయ పౌర హక్కుల రక్షణ సంఘం నాయకులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు కె.మహేష్, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజా,రవి శంకర్, ఉపాధ్యక్షులు ఎస్‌ఎ మురళి, రాజకుమార్, సహాయ కార్యదర్శులు నరసింహులు, ఆదినారాయణ, కోశాధికారినక్క శేఖర్, అంతర్జాతీయ పావుర హక్కుల రక్షణ సంఘం అధ్యక్షుడు సయ్యద్ షేక్షావలి, నాయకులు ఇసికల గోపాల్, ఖాజా మైనుద్దీన్, హెచ్‌ఎం హర్షద్, మాపీర్, మున్నా, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కళ్యాణదుర్గం టౌన్ : మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం పట్టణంలో కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనికిదగ్గ వేతనంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వన్నూరుస్వామి, శివకుమార్, నటరాజ్, దుర్గమ్మ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుడిపై ఆవు దాడి

తృటిలో తప్పిన ప్రాణాపాయం

ప్రజాశక్తి-రాయదుర్గం



వాహనదారుడిపై దాడి చేస్తున్న ఆవు

పట్టణంలోని బళ్లారి రోడ్డు సమీపంలో సోమవారం ఓ ఆవు ద్విచక్ర వాహనదారుడిపై దాడి చేసింది. వెంటనే గమనించిన స్థానికులు ఆవును తరమడంతో తుటిలో ప్రాణాపాయం తప్పింది. పట్టణంలోని నేసేపేట ఇరుమాల్ వీధిలో బైక్‌పై వెళ్తున్న ఓ రైతును అక్కడే ఉన్న ఆవు దాడి చేసింది. దీంతో బైక్‌తోపాటు వ్యక్తి కింద పడ్డాడు. పడిన బాధితుడిపై తిరిగి ఆవు దాడి చేసేందుకు ప్రయత్నించింది. ఈలోగా చుట్టుపక్కల వారు వచ్చి తరమడంతో పక్కకు వెళ్లింది. ఇలాంటి ఘటనలు రాయదుర్గంలో తరచూ జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పట్టణంలో పశువును నివారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.


ఎడిఎ అల్తాఫ్ అలీఖాన్‌కు అభినందనలు



ఎడిఎకు బొకే అందజేస్తున్న డీలర్లు

అనంతపురం : నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ జిఎం అల్తాఫ్ అలీఖాన్‌కు నగరంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్లు సోమవారం పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షులు సి.వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి రేవతి భాస్కర్‌రెడ్డి, సిరుగుప్ప వెంకటేశ్వర్లు, పాపంపేట టిడిపి నాయకులు జెట్టి రామన్నచౌదరి, అంగుళా హనుమంతురాయుడు, ఉరవకొండ రైతు మిత్ర ఏజెన్సీస్ మోహన్, అనంతపురం వ్యవసాయ డివిజన్ ఏవోలు వెంకట్‌కుమార్, కృష్ణచైతన్య, సోమశేఖర్, ఎఇఒలు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీపై ఆరా..



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ మమతాదేవి

నార్పల : మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీపై ఎంపిడిఒ మమతాదేవి ఆరాతీశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని తెలుసుకున్న ఎంపిడిఒ ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డితో కలిసి సోమవారం పాఠశాలను సందర్శించారు. ఇందులో భాగంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతోపాటు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత సర్పంచు కుళ్లాయప్పతో కలిసి భోజనానికి ఇబ్బంది లేకుండా తాత్కాలిక మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, ఉపాధి హామీ ఎపిఒ రమేష్ రామారావు, పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్ని ట్రేడ్స్ ముఖ్యమైనవే..

ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ రాయపరెడ్డి



ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని ప్రభుత్వ ఐటిఐలో శిక్షణ ఇచ్చే అన్ని ట్రేడ్‌లు ముఖ్యమైనవే అని ప్రిన్సిపాల్ రాయపరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఫస్ట్ ఫేజ్ కింద 349 మందికి 94 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. మిగిలిన వారిని ఎంపిక చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. అలాగే 23 నుంచి 25వతేదీ వరకూ కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. చాలామంది విద్యార్థులు ఎలక్ట్రికల్ మీదనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారన్నారు. అన్ని ట్రేడ్స్ ముఖ్యమైనవే అని.. ఒకటి ఎక్కువ, తక్కువ కాదన్నారు. ఏ ట్రేడ్ తీసుకున్నా మంచి ఉపాధి లభిస్తుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఐటిఐలో ఫీట్టర్, టర్నర్, మిషనిస్ట్ గ్రైండర్, డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రికల్, వైర్‌మెన్, డిఎం సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఐటి అండ్ ఇఎస్‌ఎం, ఇన్స్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్ వంటి ట్రేడ్స్ లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలైన పిఎంకెవివై, పిఎం సూర్యఘర్ ముప్తి బిజిలి యోజనతోపాటు పీఎం విశ్వకర్మ అనే కార్యక్రమం కింద ఐటిఐలో శిక్షణ పొందే వారు కాకుండా బయటి వారికి చేతివృత్తుల్లో ఏడు రోజులపాటు అంటే ఐదు రోజుల థియరీ ఒకరోజు ప్రాక్టికల్స్ ఒకరోజు పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ఎంఎస్‌ఎంఇ కింద లోన్స్ ఇప్పించి దుకాణాలు పెట్టుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. తమ ఐటిఐ పరిధిలో అనంతపురం నగరంలో బాలుర ఐటిఐ, బాలికల ఐటిఐ, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి ఐదు ప్రభుత్వ ఐటిఐలు, 17 ప్రయివేట్ ఐటిఐలు ప్రస్తుతం నడుస్తున్నాయి. అయితే ప్రభుత్వ ఐటిఐల్లో దాదాపు 25 నుంచి 30 మంది దాకా ఇన్స్ట్రక్టర్స్ కొరత ఉందని, కొత్తవారిని నియమించాలని కలెక్టర్‌ను కోరనున్నట్లు వివరించారు.

'అన్నదాత సుఖీభవ'పై నిర్లక్ష్యం తగదు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

పెట్టుబడి సాయం కింద రైతులకు ఇస్తానన్న అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు ఇవ్వకుండా వాయిదాలు వేయడం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వాయిదాలు వేయడం బాధాకరమన్నారు. ఇప్పటికే రైతులు పంటలు వేసుకుని అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారన్నారు. దీంతో అన్నదాత సుఖీభవ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి అన్నదాత సుఖీభవ కింద రైతుల ఖాతాలకు నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇకపోతే ఉపాధి హామీ కూలీలకు నాలుగు నెలల నుంచి చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు పనిముట్లు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు ఇవ్వాలని, కార్డులు ఉన్నవారికి బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ మహబూబ్‌బాషాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎన్.మధుసూదన్, ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, మండల కమిటీ సభ్యులు మురళీ, రవి, సిద్ధప్ప, జ్ఞానమూర్తి, కౌలు రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, వెంకటేశులు, మండల నాయకులు సుంకన్న, బ్రహ్మయ్య, నారాయణస్వామి, తిమ్మప్ప, వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 50 మంది ఎంపిక

అనంతపురం సిటీ : నగరంలోని ఉపాధి కల్పనా కార్యాలయ ఆవరణలో ఉపాధి కల్పనాధికారి ఎస్.పల్లవి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 50 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జాబ్‌మేళాకు 110 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎంపికైన వారు నెలకు రూ.10 నుంచి రూ.30వేల వరకూ వేతనంతో ఎంపికైనట్లు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం : స్థానిక ఆలుమూరు రోడ్డు సమీపంలో నివాసముంటున్న కమలమ్మ, బొజ్జన్న దంపతుల నాలుగేళ్ల కుమారుడు సోమవారం ఉదయం ఆడుకుంటూ ఇంటి నుండీ బయటికొచ్చాడు. అయితే తిరిగి ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక రుద్రంపేట బైపాస్ వద్ద ఏడుస్తూ కనిపించాడు. గమనించిన స్థానికులు డయల్ - 100కు సమాచారం అందించగా 4వ పట్టణ సిఐ జగదీష్ వెంటనే స్పందించి బ్లూకోల్ట్స్ సిబ్బందిని చిన్నారి ఉన్న ప్రదేశానికి పంపారు. వారు చిన్నారిని చేరదీసి పోలీసుస్టేషన్‌కు తీసికెళ్లారు. తర్వాత చిన్నారి తల్లిదండ్రుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి ఆరా తీయించారు. ఆలుమూరు రోడ్డు సమీపంలో ఉంటున్న కమలమ్మ, బొజ్జన్న అడ్రస్ కనుక్కొని పోలీసుస్టేషన్‌లో చిన్నారిని అప్పగించారు.

సీసీ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. సోమవారం మన్నీల గ్రామంలో 'సుపరిపాలనలో- తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పరిటాల సునీత ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరంచారు. అనంతరం సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎం నేతల వినతి


అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం రూరల్ మండల పరిధిలోని మన్నీల గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి మన్నీల రామాంజినేయులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పరిటాల సునీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ జెడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, ప్రహరీ లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో సిసి రోడ్లు వేయాలన్నారు. గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, విలేజ్ క్లీనిక్ భవనాలు నిర్మించాలన్నారు. గ్రామంలో 200 మంది ఇళ్ల స్థలాలు లేని వారు ఉన్నారని వారందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఆక్రమణకు గురైన కొటిమిగొండ గుంటను కాపాడాలన్నారు.



పరిటాల సునీతకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

మొక్కజొన్న వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి

ధర్నాలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు, రైతులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రైతులను మోసం చేసిన మొక్కజొన్న వ్యాపారి బి.వెంకటరామిరెడ్డిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కణేకల్ మండలం పులిచర్ల నాగిరెడ్డిపల్లి, కె.కొత్తపల్లి, పామిడి మండలం ఎద్దులపల్లి, పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లి గ్రామాల రైతులు మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. వ్యాపారి విత్తన అభివృద్ధి కోసం కడప జిల్లా పోరుమామిళ్ల మండల కేంద్రమైన బి.వెంకటరామిరెడ్డి సత్య అగ్రిటెక్ కంపెనీ ద్వారా విత్తనాలు ఇచ్చి సాగు చేయమన్నాడని తెలిపారు. పంట కోసిన తర్వాత వ్యాపారి వెంకట్రామి రెడ్డికి విక్రయించారని తెలిపారు. వ్యాపారి కొద్దిగా మొత్తం ఇచ్చి రైతులను తిప్పుకుంటూ రైతులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నాడని తెలిపారు. ఇప్పటికి ఇంకా రూ.23,18,600 లక్షలు 25 మంది రైతులకు ఇవ్వాలన్నారు. ఇవ్వకుండా నాలుగు నెలలుగా ఇబ్బందులు పెడుతున్నాడని, నాసిరకం సీడ్ ఇవ్వడం వల్ల ఎకరాక 30 క్వింటాల్ దిగుబడి రావాల్సి ఉండగా 15 క్వింటాల్ మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు. కావున డి.వెంకట్రామిరెడ్డిపై చర్యలు తీసుకుని రైతులకు రావాల్సిన మొత్తం నష్టపరిహారాన్ని ఇప్పించాలన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కణేకల్ మండల అధ్యక్షులు జయచంద్రారెడ్డి, బాధిత రైతులు గంగిరెడ్డి, జగదీశ్‌రెడ్డి, చిన్న తిప్పేస్వామి, శ్రీనివాసులు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించే పది, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ అలివేలమ్మ, ఎంఇఒ శ్రీదేవి కోరారు. ఈమేరకు సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏళ్లు నిండి చదివి, రాయగలిగే సామర్థం ఉండి మధ్యలో బడి మానివేసిన 14ఏళ్లు నిండిన వారు పదవ తరగతి, 15ఏళ్లు నిండి పదో తరగతి పూర్తయిన వారు ఇంటర్ కోర్సు చదువుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం వెంకటరామిరెడ్డి, ఎపిఒ తులసీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీని సంరక్షించాలని ర్యాలీ

పెద్దపప్పూరు : జిల్లాలోని పేదలకు అనేక సేవలు అందిస్తున్న ఆర్డీటీని సంరక్షించాలని మండలం పరిధిలోని జూటూరు జెడ్పీహెచ్ హైస్కూల్ విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పేదలకు అనేక సేవలు చేస్తోందన్నారు. అలాంటి సంస్థకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్డీటీకి వీదేశీ నిధులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి అభిమాన సంఘం ఆదినారాయణ, జూటూరు హైస్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న వామపక్షాల నాయకులు

పామిడి : ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించి ఆర్డీటీని కాపాడాలని వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ షర్మిలకు వినతిపత్రం అందజేశారు. ఆర్డీటీని పరిరక్షించాలని కోరుతూ ఐక్యమాదిగ సమాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన వంద గంటల రిలే దీక్షకు వామపక్షాల నాయకులు మద్దతు తెలిపారు. ఇందులో భాగంగా దీక్షా శిబిరం నుంచి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు రహీం, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, సిపిఐ మండల కార్యదర్శి నాగరాజు, ఐక్య మాదిగ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు వంకరాజుకాలువ వెంకటేష్, ఎంసీ నాగరాజు, టైలర్ రాజు, వడ్డే శివ, ఇమాములు, చౌడప్ప, చంద్రమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు హౌస్ అరెస్టు



వైసిపి నాయకుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం

హోంమంత్రి సత్యసాయి జిల్లా పర్యటన నేపథ్యంలో వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్‌ను ఆదివారం అర్ధరాత్రి హౌస్ అరెస్టు చేశారు. రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో సామూహిక లైంగిక దాడికి గురైన దళిత బాలికకు న్యాయం చేయాలని కోరుతూ హోంమంత్రి అనిత పర్యటనను అడ్డుకుంటామని వైసిపి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం ఆదివారం అర్ధరాత్రి నాయక్‌నగర్‌లోని సాకే చంద్రభేఖర్ ఇంటికి చేరుకున్న పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈయనతోపాటు పలువురిని ఎక్కడికక్కడ గృహ నిర్బంధాలు చేశారు. దళిత బాలికకు న్యాయం జరగాలని కోరేందుకు వెళ్తేంటే అడ్డుకోవడం ఏంటని ఇంటి వద్దే చంద్రశేఖర్ బైఠాయించి నిరసన తెలిపారు.

అర్ధరాత్రి హౌస్ అరెస్టు బాధాకరం

అత్యాచారానికి గురైన ఆడబిడ్డకు న్యాయం చేయమని అడిగితే వైసిపి నాయకులను అర్ధరాత్రి హౌస్ అరెస్టు చేయడం బాధాకరమని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. సోమవారం నగరంలోని వైసిపి కార్యాలయంలో నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాడులు, దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు నిత్యకృత్యం అయ్యాయని విమర్శించారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్నీ ఖునీ చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళలకు రక్షణ కరువైందన్నారు. అత్యాచారానికి గురైన బాలిక ప్రసవిస్తే పరామర్శించేందుకు వైసీపీ నేతలను వెళ్లనీయకపోవడం బాధాకమరమన్నారు. మీరు ఎన్ని అక్రమ కేసులు పెట్టినా.. రెడ్‌బుక్కులో పేజీలు.. పెన్నుల్లో ఇంకు అయిపోవాల్సిందే తప్ప తాము ఎప్పుడూ ప్రజల పక్షమే ఉంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బూత్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షులు ఎద్దుల ఆమర్నాథ్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎగ్గుల శ్రీనివాసులు, కార్పొరేటర్లు శ్రీనివాసులు, ఇషాక్, కమల్‌భూషణ్, రహంతుల్లా, వైసిపి నాయకులు కాకర్ల శీనా, అసీఫ్, తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన టిడిపి నాయకులు

బుక్కరాయసముద్రం : సత్యసాయి జిల్లా పర్యటనకు వచ్చిన హోంమంత్రి వంగలపూడి అనితను ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జడ్పిటిసి కాటప్పగారి రామలింగారెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా బొకే అందజేశారు. అనంతరం జిల్లాలో పార్టీ కార్యక్రమాలపై చర్చించారు.



హోంమంత్రికి బొకే అందజేస్తున్న టిడిపి నాయకులు

గ్రామీణాభివృద్ధి ప్రణాళికపై అవగాహన



యానిమేటర్లతో మాట్లాడుతున్న నార్పల ఎపిఎం తిప్పమ్మ

నార్పల : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఎపిఎం తిప్పమ్మ ఆధ్వర్యంలో సోమవారం గ్రామీణ అభివృద్ధి ప్రణాళికపై మండలంలోని యానిమేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీటి నిర్వహణ, రోడ్లు పాఠశాలలు, తదితర గుర్తించిన సమస్యలను గ్రామీణ అభివృద్ధి ప్రణాళికలో చేర్చి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిసి రత్నకుమారి, టిటిలు రామచంద్ర, కుళ్లాయప్ప, యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎపిఎం పద్మావతి ఆధ్వర్యంలో మండలంలోని యానిమేటర్లకు గ్రామీణ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ లీడర్ పెద్ద లక్ష్మమ్మ, సిసిలు వెంకటనారాయణ, కొండయ్య, శ్రీరాములు, వెంకటరాముడు, సాయి, అంజలి, యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరి పరిస్థితి విషమం



ప్రమాద బాధితులు

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మరొకరి పరిస్థితి విషయంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే.. గాంధీనగర్‌కు చెందిన కురుబ ఆదినారాయణ కుమారుడు బుల్లే పవన్‌కుమార్ వెల్డింగ్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఇందులో భాగంగానే బుక్కరాయసముద్రంలోని హోటల్ నుంచి టిఫిన్, క్యాన్‌లో నీటిని స్కూటీ వాహనంపై తీసుకొస్తుండగా మరో ద్విచక్ర వాహనంలో ఎదురుగా వేగంగా వచ్చిన రేకులకుంట కుళ్లాయప్ప (20) ఢీకొన్నాడు. దీంతో కుళ్లాయప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. పవన్‌కుమార్‌కు చేతులు, కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు బుక్కరాయసముద్రం పోలీసులకు సమాచారం అందివ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని పవన్‌కుమార్‌ను అంబులెన్స్ ద్వారా అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు బహుమతులు

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25 పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సంవత్సరంలో ప్రథమ స్థానం వై.వర్శిత, ద్వితీయ స్థానం అనుష్యరెడ్డి, తృతీయ బహుమతి చిన్న, రామనాథరెడ్డి సాంధించారు. వీరికి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యప్రసాద్‌రెడ్డి, సభ్యులు అశ్వర్‌రెడ్డి, ఆదినారాయణ స్వామి, వీరారెడ్డి ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేల నగదు బహమతి అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ ఫోన్లు పంపిణీ

అనంతపురం రూరల్ : వినికిడి లోపం ఉన్న దివ్యాంగులకు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూ భవన్ గ్రీవెన్స్ హాలులో స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, డిఆర్‌ఒ మాలోల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆఫీసర్ నాగమొని, ఎపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గృహాల పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

బొమ్మనహాల్ : గతంలో నిర్మించుకున్న ఎన్‌టిఆర్ గృహాల పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ ఎంపిటిసి కంచప్ప సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ఎన్‌టిఆర్ గృహాలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా వాటి గురించి పట్టించుకోలేదన్నారు. కావున ఇప్పటికైనా నాయకులు స్పందించి పెండింగ్‌లో ఉన్న ఎన్‌టిఆర్ గృహాల బిల్లులను చెల్లించాలని కోరారు.

నేడు వైసిపి విస్తృతస్థాయి సమావేశం

పామిడి : మండల కేంద్రంలో ఎద్దులపల్లి రోడ్డులో ఉన్న రహమత్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ టౌన్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నైరుతీరెడ్డి, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కావున కార్యక్రమానికి నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

వైసిపి నాయకుడి మృతికి నివాళి

శింగనమల : గుండెపోటుతో మృతిచెందిన మండల పరిధిలోని నాయనవారిపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ మృతికి మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు బొమ్మన శ్రీరామిరెడ్డికి నివాళు లర్పించారు. ఇందులో భాగంగా గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. నివాళు లర్పించిన వారిలో వైసిపి నాయకులు దాసరి వెంకటరమణ, నాగులగుడ్డం దాసరి వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పామిడిలో 'తొలిఅడుగు'

పామిడి : పామిడి పంచాయతీలోని 12వ వార్డులో సోమవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి టౌన్ అధ్యక్షులు బొమ్మా మోహన్, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్నగారి కుమార్, తదితరులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాబుద్దీన్, అబ్దుల్, కుళ్లాయప్ప, భాస్కర్, సంజీవ, తిమ్మప్ప, జగదీష్, పత్రా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో కంపచెట్ల తొలగింపు

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు గ్రామం శ్మశాన వాటికలో సర్పంచు బ్యులారాణి రాజశేఖర్ ఆధ్వర్యంలో జెసిబితో కంపచెట్లను తొలగించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు శ్మశాన వాటికలో పెరిగిన కంపచెట్లను తొలగించడంతో పాటు రహదారికి ఇరువైపుల అడ్డంగా ఉన్న కంపచెటను తొలగించారు.

డిటిడబ్ల్యూఒగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి (డిటిడబ్ల్యూఒ)గా ఎం.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. సోమవారం అనంతపురం జిల్లా వచ్చిన ఆయన పెన్నార్ భవన్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి డిటిడబ్ల్యూఒ రామాంజినేయుల చేతుల మీదుగా నూతన డిటిడబ్ల్యూఒగా శ్రీనివాసరావు పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతగిరి ఏటిడబ్ల్యూఒగా పని చేస్తున్న ఆయన గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా డిటిడబ్లూఓగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సూపరిన్‌టెన్‌డెంట్ సురేష్, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేసి వారు నిర్వరిస్తున్న బాధ్యతలు తెలియజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మను డిటిడబ్ల్యూఓ శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో హాజరయ్యారు.

విషజ్వరాలపై అప్రమత్తత అవసరం

యాడికి : జాతీయ డెంగీ మాసోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైరల్ ఫీవర్‌తోపాటు పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. తాడిపత్రి మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు, సిహెచ్‌ఒ జుబేదా, సూపర్‌వైజర్లు రామ్‌ప్రసాద్‌గౌడ్, శోభ, వరలక్ష్మి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

రజకుల ఆత్మీయ సమ్మేళనం

యాడికి : మండల పరిధిలోని నిట్టూరు గ్రామంలో రజకుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ సి.సావిత్రి మాట్లాడుతూ రజకులకు దోబీఘాట్ నిర్మాణం, శుభ్రమైన నీటి వసతి, శౌచాలయాల తదితర అంశాలపై ప్రస్తావించారు. రజక భవనం నిర్మాణానికి ప్రభుత్వ సాయం కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, రజకులు ఈశ్వరయ్య, రవిరాముడు, సురేష్, నాగేష్, సుబ్బరాయుడు, యల్లప్ప, రామక్రిష్ణ, నాగముని, రాజశేఖర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న టీచర్‌ను తొలగించాలి

ఉరవకొండ : బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న లెక్కలు టీచర్ సతీష్‌ను తొలగించాలని ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ నియోజకవర్గ కన్వీనర్ భీమేష్ డిమాండ్ చేశారు. విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన వజ్రకరూరు మండల పరిధిలోని చిన్న గడేహోతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీచర్‌పై చర్యలు తీసుకోవాలని డివైఇఒ మల్లారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఎఐఎస్‌ఎ నాయకులు వంశీ, మోహన్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

ఉరవకొండ : బాలికలు అన్నిరంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బేటీ బచావో-బేటీ పడావో'పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మాయిలు అన్నిరంగాల్లో అభివద్ధి చెందాలంటే తప్పనిసరిగా విద్య అవసరమన్నారు. కావున తల్లిదండ్రులు బాలికలను చదివించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ నాగ రంగయ్య, డిప్యూటీ హెల్త్ ఇండికేటర్ షఫీ, సూపర్‌వైజర్ శేఖర్, స్టాఫ్‌నర్స్ అనిత, ఫార్మసీ ఫీసర్ మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడికి పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అనంతపురంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కంబదూరు మండలం రాంపురం గ్రామానికి చెందిన వైసిపి యువ నాయకుడు చిరంజీవిని కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య, వైసిపి రాష్ట్ర కార్యదర్శి బి.తిప్పేస్వామి పరామర్శించారు. ఈ సందర్భంగా చిరంజీవి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకునేలా వైద్యం అందించాలని కోరారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షులు బొమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, హనుమంతురాయుడు, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ తిప్పేస్వామి, జానీ, తదితరులు ఉన్నారు

కౌన్సిల్‌లో సమస్యలపై ఏకరువు

కళ్యాణదుర్గం టౌన్ : వైస్ ఛైర్మన్ తిమ్మప్ప అధ్యక్షతను సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పలువురు సభ్యులు సమస్యలపై ఏకరువు పెట్టారు. ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం మధ్య సమన్వయ లోపంతో దాదాపు ఏడునెలలుగా కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదు. దీనిపై రెండు రోజులుగా స్వయానా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విమర్శలు కూడా చేసిన విషయం తెలిసిందే. ఎట్టకేలకూ సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించగా ఒడిదొడుగుల మధ్య సాగింది. సమావేశాన్ని నిర్వహించాల్సిన ఛైర్మన్ అందుబాటులో లేకపోగా ప్రజా సమస్యలు పరిష్కరించలేక పోతున్నామని పలువురు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మున్సిపాలిటీలో ప్రధానమైన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.3కోట్లు నిధులతో చేయడానికి సమావేశం ఆమోదం తెలిపింది.

పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో అక్రమాలపై విచారణకు వినతి



ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో జరుగుతున్న అక్రమాలపై సమగ్రమైన విచారణ జరపి సంబంధిత వార్డెన్‌లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 4వ తేదీ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అమలు జరుగుతోంద న్నారు. అయినప్పటికీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో మధ్యాహ్నం భోజనం పెడుతున్నట్లు డైట్ బిల్లులు మంజూరు కోసం బిల్లులు పెట్టి లబ్ది పొందుతున్నారని తెలిపారు. పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టకపోయినా బిల్లులు పెట్టిన వార్డెన్‌లపై సమగ్రమైన విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వార్డన్‌లను సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు.

విద్యాహక్కు చట్టాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

విద్యాహక్కు చట్టాన్ని పరిరక్షించాలని వైఎస్‌ఆర్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ కోరారు. ఈమేరకు సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మకు వినతిపత్రం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతోందన్నారు. మంత్రి నారా లోకేష్ తన శాఖలో పట్టు కోల్పోయి సఖలశాఖలకు షాడో సీఎంలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యావ్యవస్థను ప్రోత్సహిస్తున్నారనాన్రు. దీంతో ప్రభుత్వ విద్య కుంటు పడిందన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు రక్షణ అవసరమన్నారు. అలాగే ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంతోపాటు మౌలిక వసతులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, నగర అధ్యక్షులు కైలాష్, నగర కార్యదర్శి ఫయాజ్, వంశీనాయుడు, చంద్రమౌళి, రాహుల్‌రెడ్డి, రఫీ, పులి కార్తికేయ, శేఖర్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ప్రజాశక్తి-కుందుర్పి

మండలం పరిధిలోని రుద్రంపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థ తల్లిదండ్రులను పక్కదోవ పట్టిస్తున్నాడని ఎంఇఒ తిప్పేస్వామి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుద్రంపల్లి గ్రామంలో యూపీ స్కూలును ఉన్నతాధికారులు ఉన్నత పాఠశాలగా మార్చారన్నారు. ఇందుకు అనుగుణంగా ఉపాధ్యాయులను కూడా నియమించారన్నారు. అయితే ప్రధానోపాధ్యాయులు శివానందరెడ్డి మాత్రం పాఠశాలలో చేరేందుకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులతో పాఠశాలకు ఎస్‌ఎస్‌సి కోడ్ రాదని.. రాకపోతే తాము బాధ్యులం కాదని అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఆయన పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు హెచ్చరించినా ఫలితం లేకుండా పోతోందన్నారు.

మోడల్ స్కూల్లో సీట్ల భర్తీపై విచారణకు వినతి

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలలో 6, 7, 8, 9వ తరగతుల సీట్ల భర్తీలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని ఎఐఎస్‌ఎస్ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని మండల విద్యాశాఖ అధికారిణి నాగమణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ మోడల్ పాఠశాలలో ప్రవేశాలపై పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా సీట్లను భర్తీ చేయాల్సి ఉండగా ప్రిన్సిపాల్ ఆ విధంగా వ్యవహరించలేదన్నారు. రాజకీయ నాయకులు, ఉపాధ్యాయుల సిఫార్సుల మేరకు సీట్లను భర్తీ చేశారన్నారు. వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు తరుణ్, మోహన్, హరి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమస్యలు పరిష్కరించాలి

గుత్తి : గుత్తి ఆర్‌ఎస్‌లోని 7వ వార్డులో ఉన్న మహిళా సామూహిక మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలని వార్డు టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్‌ఛైర్మన్ మందల నాగరాజు, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ సామూహిక మరుగుదొడ్లు దుర్గంధ భరితంగా మారాయన్నారు. మరుగుదొడ్ల సంబంధించిన మెటికలు ధ్వంసం అయ్యాయని తెలిపారు. కంపచెట్లు పెరగడంతో ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. దీంతో మరుగుదొడ్ల సమస్యను పరిష్కరిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు.

ఎంపి మిథున్‌రెడ్డి అరెస్టు అన్యాయం

రాయదుర్గం : వైసిపి లోకసభా పక్ష నేత, ఎంపి మిథున్‌రెడ్డి అరెస్టు అన్యాయమని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ఇది ప్రజలతో నిత్యం నిలబడే వారి గొంతు నొక్కడం లక్ష్యంగా చేసుకున్న రాజకీయ కుట్ర అన్నారు. వరుసగా మూడుసార్లు ఎంపిగా ఎన్నికైన మిథున్ రెడ్డిని బలవంతంగా రికార్డు చేసిన స్టేట్‌మెంట్ల ఆధారంగా నమోదు చేసి తప్పుడు కేసులో ఇరికించారన్నారు. కూటమి వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే అరెస్టు చేశారన్నారు. న్యాయ విచారణ జరిగితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.